సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 6 । నవంబర్ । 2024



పనితీరు మారకుంటే చర్యలు

ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు పనితీరు మారాలని లేకుంటే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. 8లో



నాలుగు నెలల చిన్నారి మృతి

అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగు నెలల చిన్నారి చింతూరు ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. 8లో



ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

మంచు కమ్మేస్తోంది.. చలి వణికిస్తోంది

చింతపల్లి, పాడేరు, అరకులోయలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

చలిగాలులకు మన్యం వణికిపోతోంది. సాయంత్రం ఆరు గంటల నుంచి చల్లని గాలులు వీస్తుండగా అర్ధరాత్రి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో గిరిజనులు ఇళ్లకు పరిమితం అవుతున్నారు. వాతావరణం మార్పుతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. స్వెటర్లు, చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

- కనిష్టంగా 14 నుంచి 16 డిగ్రీల నమోదు
- సాయంత్రం నుంచి చలిగాలులు
- అర్ధరాత్రి నుంచి దట్టంగా కురుస్తున్న పొగమంచు
- మంటలను ఆశ్రయిస్తున్న గిరిజనం



దుంబ్రిగుడలో మంట కాగుతున్న గిరిజనులు



జిల్లా కేంద్రం పాడేరు పట్టణాన్ని పట్టపగలు కమ్మేసిన మంచు తెరలు

సాక్షి,పాడేరు: మన్యంలో కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. మంగళవారం 14 నుంచి 16 డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 14.6 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 16 డిగ్రీలు నమోదయ్యాయి.

- సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం చల్లబడుతోంది. చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. రాత్రి ఎనిమిది గంటల తరువాత చలి తీవ్రంగా ఉంటోందని గిరిజనులు వాపోతున్నారు. అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తున్న సమయంలో చలి మరింత ఎక్కువగా ఉంటోందని వారు వాపోతున్నారు.
- చలి పెరగడంతో మన్యంలోని అన్నివర్గాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఉదయాన్నే వ్యవసాయ పనులు, వారపుసంతలకు వెళ్లే గిరిజనులు చలిగాలులకు వణికిపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి ఈ విధంగానే ఉంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు కమ్ముకోవడంతో వాహన చోదకులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. ఈనెల 3న అరకులోయలో 17 డిగ్రీలు, చింతపల్లిలో 16.6 డిగ్రీలు, మినుమూలూరులో 18 డిగ్రీలు, 4న చింతపల్లిలో 15.8 డిగ్రీలు, చింతపల్లిలో 18 డిగ్రీలు, మినుమూలూరులో 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఇంటి వద్ద మంట కాగుతున్న వృద్ధురాలు

మంచు కురిస్తేనే..

జిల్లాలో పర్యాటక సీజన్ పూర్తిగా మంచుపైనే ఆధారపడి ఉంది. ప్రకృతి సోయగాలను తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రెండు మూడు రోజులపాటు మన్యం సందర్శనకు కేటాయిస్తుంటారు. అందాలను వీక్షిస్తూ ప్రత్యేక అనుభూతి పొందుతుంటారు. వీరి రాకతోనే గిరిజనులకు ఉపాధి అందుబాటులోకి వస్తుంది.

ఆ మూడు చోట్ల..

- పాడేరు ఘాట్‌లో పోతురాజుస్వామి కాఫీ తోటల నుంచి మోదకొండమ్మ తల్లి పాదాల గుడి వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా మంచు వానలో కురుస్తుంది.
- లంబసింగి ఘాట్‌రోడ్డులో సెంటరుకు సమీపంలో కూడా చలితీవ్రతగా ఎక్కువగా ఉంటోంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నమోదయ్యే కనిష్ట ఉష్ణోగ్రతల కన్నా ఇక్కడ సుమారు 3 డిగ్రీలు తక్కువగా ఉంటుంది. లంబసింగిని కొర్రబయలు అనికూడా పిలుస్తుంటారు. ఇక్కడ చలి, మంచు తీవ్రతకు కొర్రు బారడం వల్ల ఆ పేరు వచ్చిందని చెబుతుంటారు.
- అరకు ఘాట్‌రోడ్డులో సుంకరమెట్ట కాఫీ తోటలు నుంచి అరకు వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పొడవునా వేసవిలో కూడా చల్లని వాతావరణం ఉంటుంది.



వంతాడపల్లిలో అటవీ ప్రాంతం నుంచి కట్టెలు తీసుకువస్తున్న గిరిజనులు

డల్లాపల్లి ప్రత్యేకం

జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన డల్లాపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సముద్రమట్టానికి 3,500 అడుగుల ఎత్తులో ఉన్నందున రోజంతా ఈ ప్రాంతం కూల్‌గా ఉంటుంది. ఇక్కడ మంచు అప్పుడప్పుడు గడ్డ కడుతూ ఉంటుంది. చలిని ఆస్వాదించాలనుకునే పర్యాటకులు అక్కడికి వెళ్లేందుకు ప్రాధాన్యమిస్తారు. పగటి వేళల్లో మేఘమాలికలు కనువిందు చేస్తుంటాయి.

నిత్యం 'భోగి' మంటలే..

మైదాన ప్రాంతంలో సాధారణంగా సంక్రాంతి పండగ రోజుల్లో మాత్రమే మంటలు కనిపిస్తాయి. మన్యంలో అలాకాదు శీతాకాలం అంతా చలిమంటలు కనిపిస్తుంటాయి. వెచ్చదనం కోసం ఇంట్లో కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటారు. అడవులనుంచి కట్టెలను మంటలకు వినియోగిస్తున్నారు. వీటివల్ల వాటికి డిమాండ్ పెరిగింది. కట్టెలు అమ్మే వారు మంచి ఆదాయం పొందుతున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



చలికాలంలో ఉపిరితిత్తులు, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉదయం,రాత్రి సమయాల్లో సురక్షిత ప్రాంతాల్లోనే ఉండి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలి. చలికాలంతో చర్మవ్యాధులు సోకే అవకాశం ఉంది.వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ప్రజలు వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ కె.కృష్ణారావు, ఈఎన్‌టీ వైద్యనిపుణుడు, జిల్లా వైద్యవిధాన పరిషత్ సమన్వయకర్త

చలి తీవ్రత పెరిగే అవకాశం



ఈఏడాది కూడా చలితీవ్రత ఎక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. శీతాకాలం ప్రారంభం నుంచి 20డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత రెండు రోజుల నుంచి చలితీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుతున్నాయి. ఈనెలాఖరు నుంచి చలి ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ అప్పలస్వామి, ఏడీఆర్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

వరి రైతుల్లో ఆందోళన

దుంబ్రిగుడ/చింతపల్లి: మండలంలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి.చలితీవ్రత కూడా ఎక్కువగా ఉంటోంది. ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగా ఉంది. అయితే మంచు వల్ల గింజ కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన ఉన్ని దుస్తుల అమ్మకాలు



అరకులో ఉన్ని దుస్తుల అమ్మకాలు

చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తుల అమ్మకాలు జోరందుకున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఈ ఏడాది ముందుగానే పాడేరు, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలను ఏర్పాటుచేశారు.

న్యూస్‌రీల్

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- జీసీసీ డీఎం సింహాచలం హెచ్చరిక



గోదాంను పరిశీలిస్తున్న డీఎం సింహాచలం

అరకులోయ రూరల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని జీసీసీ డీఎం సింహాచలం హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక సివిల్ సప్లయ్ గోదాంను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాంచి మేనేజర్ పర్యవేక్షణ లోపించిందన్నారు. పనితీరు మార్చుకోకుండా ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. ఆయన వెంట బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సుందరీకరణ పనులు పూర్తి చేయండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



నిర్వాహకులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్: పద్మాపురం గార్డెన్ సుందరీకరణ పనులు త్వరితంగా పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మంగళవారం ఉద్యానవనాన్ని సందర్శించిన పనుల తీరును పరిశీలించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అవసరమైన చోట విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు . హాట్ ఎయిర్ బెలూన్‌కు పెన్సింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సుందరీ కరణ పనులన్నింటిని ఈనెల 15లోగా పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈ అభిషేక్, గార్డెన్ మేనేజర్ బొంజిబాబు, బెలూన్ నిర్వాహకుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న డీడీ రజని

జి.మాడుగుల: మండలంలోని గాంధీనగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను మంగళవారం సాయంత్రం పాడేరు గిరిజన సంక్షేమశాఖ డీడీ రజని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలో వంటశాలను పరిశీలించారు. విద్యార్థినుల పఠనా సామర్థ్యాన్ని తనిఖీ చేశారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థినులకు సూచించారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వంటశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించిన మందుల పంపిణీ చేశారు.

చట్టాలు, హక్కుల పరిరక్షణకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

ముంచంగిపుట్టు: ఆదివాసీ చట్టాలు,హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం(జీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కిషోర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులకు గిరిజన చట్టాలు,హక్కులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీల హక్కులు,చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని, గిరిజన యువత అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో అరకులోయలో జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆదివాసీ విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మాదవ్, జేఏసీ నాయకులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీవో నంబరు 3తో నూరు శాతం మేలు

- పునరుద్ధరణ బాధ్యత చంద్రబాబుదే
- లేకుంటే ప్రత్యామ్నాయ జీవోలు జారీ చేయాలి
- ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర వ్యాప్త పోరాటం
- గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు హెచ్చరిక



మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు, చిత్రంలో ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

సాక్షి,పాడేరు: గిరిజనులకు నూరుశాతం మేలు జరిగే జీవో నంబరు3ను పునరుద్ధరించాలని, లేకుంటే గిరిజన అభ్యర్థులకు న్యాయం చేసేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో అరకు వేదికగా తాము అధికారంలోకి వస్తే జీవో నంబరు పునరుద్ధరిస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. గిరిజన యువతీ,యువకులకు న్యాయం చేస్తానని పెద్దకబుర్లు చెప్పిన ఆయన సీఎం అయ్యాక ఆ విషయాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. జీవో నంబరు3ను పునరుద్ధరించకుండానే మెగా డీఎస్సీ ప్రకటనకు కూటమి ప్రభుత్వం సిద్ధమవడం అన్యాయమన్నారు. గిరిజన అభ్యర్థులకు నూరుశాతం ఉద్యోగాలు కల్పించలేని మెగా డీఎస్సీని తామంతా గిరిజనులను దగా చేసిన డీఎస్సీ గానే పరిగణిస్తామన్నారు. జీవో నంబరు 3ను పునరుద్ధరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులతో కలిసి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

గిరి యువతకు ఉద్యాగాల కల్పనే లక్ష్యం: అరకు ఎంపీ తనూజారాణి

జీవో నంబరు 3 పునరుద్ధరణ, గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా పోరాటానికి సిద్ధమని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాను పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జీవో నంబరు 3 పునరుద్ధరణపై మాట్లాడినట్టు గుర్తు చేశారు. నూరుశాతం ఉద్యోగాల జీవోను గతంలో సుప్రీంకోర్టు రద్దు చేసిన తరువాత గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈజీవో రద్దుపై స్టేకు ప్రయత్నించడం అందరికీ తెలిసిందేనన్నారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు న్యాయం జరిగేలా వారి పక్షాన ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

గిరి యువతకు న్యాయం చేయాల్సిందే: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

జీవో నంబరు 3 పునరుద్ధరణ లక్ష్యంగా గిరిజనులకు నూరుశాతం జరిగే వరకు పోరాడతామని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో గిరిజనులకు అన్ని హక్కులు, చట్టాలు కల్పించారని, అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా శంకరన్ గొప్ప ఆలోచనతో జీవో నంబరు ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి జీవో నంబరు 3 పునరుద్ధరణకు లక్ష్యంగా, ప్రత్యామ్నాయ జీవోలకు చట్టబద్ధత తీసుకువచ్చేందుకు ఎంతో ప్రయత్నించారన్నారు. గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాల కల్పనకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా మెగా డీఎస్సీ ప్రకటిస్తే గిరిజన ద్రోహిగా చంద్రబాబు మిగిలిపోతారన్నారు. గిరి యువకతు వెంటనే న్యాయం చేయకుంటే అన్ని ప్రజా, గిరిజన సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో హుకుంపేట మాజీ జెడ్పీటీసీ కొర్రా కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, సంయుక్త కార్యదర్శులు కూడా సురేష్ కుమార్, కిల్లు కోటిబాబునాయుడు, చింతపల్లి మాజీ ఎంపీపీ వంతాల బాబురావు, పలువురు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో మల్బరీ సాగు

- విస్తరణకు ప్రణాళికపరంగా చర్యలు
- ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించండి
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో మల్బరీ సాగును విస్తరించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మైక్రో ఇరిగేషన్, సెరికల్చర్, టూరిజం, స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం జిల్లా అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 10విడతల్లో పట్టుపురుగుల ద్వారా రైతులకు రూ.లక్ష ఆదాయం వస్తుందన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో మల్బరీసాగు, పట్టుపురుగుల పెంపకాన్ని విస్తరించి రైతులకు ఆదాయం పెంచాలని సూచించారు. అలాగే 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, పెద్ద ఎత్తున మైక్రో ఇరిగేషన్ యూనిట్లను మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. పౌష్టికాహార లోపం, బాల్య వివాహాల నిర్మూలనపై చర్యలు తీసుకోవాలని, కిశోర వికాస్ పథకంలో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. వర్చువల్‌గా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వ భరత్,మైక్రో ఇరిగేషన్ పీడీ రహీం, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీపీవో లవరాజు, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, సీపీవో ఎస్ఆర్‌కే.పట్నాయక్, ఎల్‌డీఎం మాతునాయుడు, సెరికల్చర్ ఏడీ అప్పారావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి జి.దాసు, డ్వామా పీడీ శివయ్య,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జల ఉత్సవం

జల ఉత్సవాన్ని ఈనెల 6 వ తేదీ నుంచి జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీ, మండల కేంద్రాల్లో ఈనెల 20వతేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. నీటి వనరుల సంరక్షణలో స్థానిక సంఘాల భాగస్వామ్యం కీలకమైందన్నారు. జలసంరక్షణ, నీటి లభ్యత, తాగునీటి పథకాల క్లోరినేషన్ వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్థానిక ప్రజాప్రతినిధులు,పాఠశాలల విద్యార్థులు,డ్వాక్రా సంఘాలు,సచివాలయాల సిబ్బందిని భాగస్వామ్యం చేయిలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ బి.మురళి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎల్‌పీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆవేదన దీక్ష ప్రారంభం



పాడేరు ఐటీడీఏ ఎదుట దీక్ష చేపట్టిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు

పాడేరు : గిరిజన యువతకు మేలు చేసే జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖీ శేషాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం ఐటీడీఏ ఆవరణలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో 48 గంటల ఆదివాసీల ఆవేదన దీక్షను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దీక్షను కొనసాగించారు. బుధవారం కూడా సాయంత్రం వరకు దీక్షను కొనసాగించి వినతిపత్రాన్ని అధికారులకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 3ను కొనసాగించాలని, లేకుంటే ప్రత్యామ్నాయ జీవో ప్రవేశపెట్టి డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేయాలని కూటమి కోరారు. సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో నంబరు 3ను పునరుద్ధరించి, ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తామన్న హామీని చంద్రబాబు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దీనిని అమలుచేయకుంటే ఆదివాసీలంతా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, లోకల్ క్యాడర్ టీచర్ పోస్టులన్నీ స్థానిక ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో ఆదివాసీల ఉద్యోగాలంతా ఆదివాసీలకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే గిరిజనుల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. అఖిల భారత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సింహాచలం, కోశాధికారి వంతాల రామారావు, అసోషియేట్ అద్యక్షుడు ఎం. ఈశ్వర్‌రావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

42 మంది కూలీలకు తప్పిన ప్రమాదం

- సరిగ్గా పనిచేయని సీలేరు జలవిద్యుత్ కేంద్రం రెగ్యులేటరీ డ్యామ్ గేట్లు
- నియంత్రించే అవకాశం లేక భారీగా పెరిగిన ప్రవాహం
- సకాలంలో స్పందించిన జెన్‌కో అధికారులు
- అవతల పక్కన చిక్కుకున్న గిరిజనులను నాటు పడవలపై తరలింపు



ఫోర్‌బే నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

సీలేరు: ఏపీ జెన్‌కో అధికారులు సకాలంలో స్పందించడంతో 42 మంది గిరిజనులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్ డ్యామ్ నుంచి మంగళవారం మధ్యాహ్నం జల విద్యుత్ కేంద్రానికి నీటిని విడుదల చేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేసిన అధికారులు రెగ్యులేటరీ డ్యాం గేట్లు మూసివేయాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే అవి మొరాయించడంతో ఫోర్‌బే నుంచి నీరు భారీగా దిగువకు వెళ్లింది. దీంతో కూలిపనుల నిమిత్తం వెళ్లిన చింతపల్లి క్యాంప్‌కు చెందిన సుమారు 42 మంది గిరిజనులు అవతల ఒడ్డున ఉండిపోయారు. ప్రాణభయంతో జెన్‌కో అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి స్పందించి స్థానికుల సాయంతో నాటుపడవలపై వారిని గ్రామానికి తరలించారు.

క్లుప్తంగా

మర్రివాడలో పూరిల్లు దగ్ధం

కొయ్యూరు: మర్రివాడలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో కంకిపాటి సావిత్రి అనే మహిళకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. నాగుల చవితి సందర్భంగా కొందరు టపాసులు కాల్చడంతో వాటి నిప్పురవ్వలు సావిత్రి తాటాకు ఇంటిపై పడడంతో మంటలు చెలరేగాయి.స్థానికులు గమనించి వెంటనే మంటలను ఆర్పారు. అయితే అప్పటికే చాలా వరకు ఇల్లు కాలిపోయింది. రూ.40 వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. అధికారులు ఆదుకోవాలని ఆమె కోరింది.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ గణపతి

ముంచంగిపుట్టు: తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సర్పంచ్ బాబూరావు తెలిపారు. పెదగూడ పంచాయతీ పనస గ్రామంలో జెడ్పీ నిధులు రూ.1.40 లక్షలతో ఏర్పాటు చేయనున్న బోరు పనులకు మంగళవారం సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు గణపతి,నేతలు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

బొమ్మల తయారీపై ఉచిత శిక్షణ

రంపచోడవరం: ఉద్యానవన పరిశోధన స్థానం పందిరిమామిడి, కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన యువకులు, మహిళలకు కొబ్బరి, తాటి ఉప ఉత్పత్తుల నుంచి బొమ్మల తయారీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి వి.సి.వెంగయ్య తెలిపారు. కనీసం పదో తరగతి చదివిన వారు శిక్షణకు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7382633663,8864243577 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కూటమి మెడలు వంచైనా హామీలు సాధిద్దాం

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర



దీక్షలో నిరసన తెలుపుతున్న నాయకులు



అరకులోయలో నిరుద్యోగులతో ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నేతలు

అరకులోయ రూరల్: ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. జీవో నంబర్-3కి చట్టబద్ధత కల్పించాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆదివాసీ ఆవేదన దీక్షకు ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మెడలు వంచైనా హామీలను సాధించుకుందామని చెప్పారు. జీవో నంబర్-3కి చట్టబద్ధత కల్పించాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. లేకపోతే ప్రజాగ్రహానికి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు నందో, కొండబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, నాయకులు చిన్నబాబు,మహదేవ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

అరకులోయ రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. మండల కేంద్రం అరకులోయలో కళాశాలల విద్యార్థులు, గిరిజన నిరుద్యోగ యువతతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనరల్ డీఎస్సీతో పాటు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీవో నంబర్-3ని చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకే 100శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈనెల 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జీవో నంబర్-3కి చట్టబద్ధత కల్పించడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గురుకుల,గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణను అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తే మరింత నష్టం జరుగుతుందని, అక్షయ పాత్రను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నబాబు,ప్రసాద్,కృష్ణ, రాజు,జానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మారకుంటే చర్యలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక
- కిల్లోగుడ బాలుర ఆశ్రమ పాఠశాల సందర్శన
- మెనూ అమలుచేయని డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడ: ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు పనితీరు మారాలని లేకుంటే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. సోమ, మంగళవారాల్లో అందించిన మెనూ వివరాలను విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. మంగళవారం వంకాయ కూరకు బదులు బంగాళదుంప కూర పెట్టారని, సాయంత్రం రాగి మాల్ట్, స్నాక్స్ పెట్టలేదని వారు వివరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఎందుకు అందించలేదని డిప్యూటీ వార్డెన్‌పై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాగి పిండి లేకపోతే బయట ఎందుకు కొనుగోలు చేయలేదని వార్డెన్‌ను ప్రశ్నించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. సహాయ గిరిజన సంక్షేమ అధికారులు ఆశ్రమ పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అసంతృప్తికి గురైన పీవో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేస్‌లైన్ పరీక్షల ప్రకారం విద్యార్థులను ఏబీసీడీ గ్రూపులుగా విభజించి, సీ,డీ గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. మెనూ సక్రమంగా అమలు అమలుచేయని డిప్యూటీ వార్డెన్ కె.బాలికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలని సూచించారు. ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎల్. రజని పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకపోతే సహించేది లేదు



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సన్మానిస్తున్న పీవీటీజీ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

అరకులోయటౌన్: వసతి గృహాల్లో మెనూ అమలు చేయకపోతే సహించేది లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. స్థానిక కంఠబౌంషుగుడ (సీఏహెచ్ స్కూల్) ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహారపదార్థాలను పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిషు పాఠ్య పుస్తకాలను చదివించారు. అరకులోయలోని ఏపీ గురుకుల బాలుర పాఠశాలలోని క్రీడా మైదానం తనదంటూ ఓ ప్రైవేట్ వ్యక్తి గొడవకు వస్తున్నారని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్థానిక తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వాభి రాంచందూర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మత్స్యలింగంకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అరకులోయటౌన్: జిల్లాలో పని చేస్తున్న మాతృ బహుభాష బోధన ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని కోరుతూ అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు మాతృ బహు భాష ఉపాధ్యాయుల సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ఐటీడీఏల పరిధిలో జీపీఎస్, ఎంపీపీఎస్, యూపీఎస్ పాఠశాలల్లో 2007వ సంవత్సరం నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు కేవలం రూ. 5వేలు గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో సవర, కువి, కొండ, ఆదివాసీ ఒరియా, కొయా మగాలి వంటి స్థానిక భాషలతో 776 మందికి బోధిస్తున్నట్టు చెప్పారు. కనీస వేతనం చెల్లించాలని, అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించి, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని సంఘం ప్రతినిధులు మర్రి చిట్టి బాబు, పాంగి కుమారి, సోమేలి నాగేంద్ర అరకులోయ ఎమ్మెల్యేను కోరారు.

ప్రతిభావంతులకు అభినందన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్

చింతపల్లి: రాష్ట్ర స్థాయి సాంస్కృతి ఉత్సవ, ఇతర పోటీల్లో సత్తా చాటిన చింతపల్లి ఏకలవ్య పాఠశాల విదార్థినీవిద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ అభినందించారు. అరకులోయ ఈఎంఆర్ పాఠశాలలో గత నెలలో నిర్వహించిన పలు పోటీల్లో చింతపల్లి ఏకలవ్య పాఠశాలకు చెందిన గుల్ల చరణ్ లిఖిత్, కె.అమృత,మోహనసాయి, మీనాక్షి, గాయత్రి,చందన,ధరణి,బి.సురేంద్ర, చరణతేజ ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారు. విజేతలకు మంగళవారం ఉత్సవ నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాలను, బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది జయంత్ హరి,నాయుడు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో గల ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఉత్పత్తులు, గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ గ్లోబల్ మార్కెటింగ్ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓఎన్‌డీసీ వెబ్‌సైట్‌ని అందుబాటులోకి తెచ్చిందని వెలుగు ఐటీ మేనేజర్ లంకే రామరాజు తెలిపారు. గిరిజనప్రాంతంలో చాలా మంది గిరిజనులు, డ్వాక్రా మహిళలు రకరకాల ఆహార, ఆహారేతర వస్తువులు, వెదురు ఉత్పత్తులు, అల్లికలు, మిల్లెట్స్, చీపుళ్లు , టైలరింగ్ వంటి వస్తువులు ఆన్‌లైన్‌లో ఉచితంగా అమ్ముకునే సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ వివరాలు వెలుగు కార్యాలయంలో అందించాలన్నారు.

సీలేరు ఎస్‌ఐగా రవీంద్రనాథ్



సీలేరు: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు సీలేరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా రవీంద్రనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముంచంగిపుట్టు ఎస్‌ఐగా పనిచేసిన ఆయన బదిలీపై సీలేరుకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధానికి, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, దొంగతనాలు వంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నాలుగు నెలల చిన్నారి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
- ఐటీడీఏ ఎదుట ఆందోళన



చిన్నారి మృతదేహంతో ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

చింతూరు : అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన నాలుగు నెలల చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు ఐటీడీఏ ఎదుట బిడ్డ మృతదేహంతో ఆందోళన చేశారు. మండలంలోని చదలవాడకు చెందిన కలుముల దుర్గారావు, బుల్లెమ్మల నాలుగు నెలల ఆడబిడ్డకు అనారోగ్యంగా ఉండడంతో సోమవారం రాత్రి స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పాపను పరీక్షించిన డ్యూటీ వైద్యులు చిన్నపిల్లల వైద్య నిపుణుడి సలహా మేరకు వైద్యం అందించారు. కాగా మంగళవారం చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హర్ష చిన్నారిని పరిశీలించి ఎక్స్‌రేతో పాటు రక్తపరీక్ష నిర్వహించాలని సూచించారు. దీంతో అదే ఆస్పత్రిలో పాపకు రక్త పరీక్ష చేయించిన అనంతరం పరిస్థితి విషమంగా మారి మధ్యాహ్నం పాప మృతిచెందింది.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

పాపకు ఆయాసం అధికంగా ఉండడంతో సోమవారం రాత్రే తాము భద్రాచలం తీసుకెళతామని ఎంత చెప్పినా వైద్యులు వినలేదని, మీ పాప బాగానే వుందని ఇక్కడే వైద్యం అందిస్తామని తెలిపారని, మంగళవారం కూడా ఇదే మాట చెప్పారని పాప తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో తమ పాప పరిస్థితి మరింత విషమించి మృతిచెందిందని, వైద్యుల నిర్లక్ష్యమే తమ పాప మృతికి కారణమంటూ వారు స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పీవో అపూర్వ భరత్ చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై వైద్యులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుని తగిన న్యాయం చేస్తానని వారికి హామీనిచ్చారు. అనంతరం చిన్నారి మృతదేహంతో పాటు తల్లిదండ్రులను ఆయన తన కారులో వారి స్వగ్రామానికి పంపించారు.

ఒక్కసారిగా విషమం

మంగళవారం మధ్యాహ్నం వరకు బాగానే వున్న చిన్నారి ఒక్కసారిగా పరిస్థితి విషమించి మృతిచెందినట్టు స్థానిక ఏరియా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్ష తెలిపారు. మంగళవారం తాను పాపను పరిశీలించి ఎక్స్‌రేతో పాటు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించానని, రక్త పరీక్ష చేయించిన అనంతరం ఒక్కసారిగా పరిస్థితి విషమించిందని తెలిపారు. ఈ క్రమంలో భద్రాచలం రిఫర్ చేసి అంబులెన్స్‌కు సమాచారమిచ్చామని, ఉదయం 11.30కు అంబులెన్సు వచ్చినా దానిలో ఆక్సిజన్ సౌకర్యం లేకపోవడంతో పాపను పంపలేదని అన్నారు. కూనవరం నుంచి మరో అంబులెన్సును రప్పించే ఏర్పాటు చేశామని, అది వచ్చే లోగానే పాప మృతిచెందిందని వివరించారు.

ముంచంగిపుట్టులో దొంగల హల్‌చల్



దొంగతనం జరిగిన కిరాణా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ



దొంగలు వదిలి వెళ్లిన రాడ్లు, కట్టర్లు

- కిరాణా దుకాణంలో చోరీ
- మరికొన్ని దుకాణాల్లో యత్నం

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలో కిరాణా షాప్‌లో చొరబడి, కిరాణా సరుకులతో పాటు నగదును దోచుకొని పోయారు. దీంతో పాటు పలు దుకాణాల్లో చోరీకి ప్రయత్నాలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఎస్.వసంత కిషోర్ కిరాణా షాప్‌కు చెందిన ఇనుప గ్రిల్స్‌ను దొంగలు కట్టర్లతో తొలగించి లోపలకు ప్రవేశించారు. పలు రకాల కిరాణా సామాగ్రి, వస్తువులు, సుమారు రూ.15వేల నగదును ఎత్తుకు పోయారు. ముందుగా సీసీ కెమెరాలను ఎంతో చాకచక్యంగా పగలగొట్టి, దొంగనతం చేశారు. మంగళవారం ఉదయం షాప్‌ను తెరిచేందుకు వచ్చిన షాప్ యాజమాని వసంత కిషోర్ దొంగతనం జరిగినట్టు గుర్తించి, వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా దొంగలు మరో రెండు దుకాణాల్లో సైతం చోరీకి ప్రయత్నం చేసినట్టు సీసీ కెమెరాల పరిశీలనలో తెలిసింది. దొంగతనం జరిగిన దుకాణాన్ని ఎస్ఐ జె.రామకృష్ణ సందర్శించారు. మండల కేంద్రంలో ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. రాత్రి 1గంట నుంచి 3గంటల మధ్య దొంగతనం జరిగినట్టు గుర్తించామని,దొంగతనం జరిగిన షాప్ వద్ద కట్టర్లు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండల కేంద్రంలో రాత్రి పూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహిస్తామని, దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

రైతులకు ఆధునిక సాంకేతికతను అందించాలి



మేక పిల్లలను పరిశీలిస్తున్న విస్తరణ సంచాలకులు గోవిందరాజులు

రంపచోడవరం: మన్యంలో రైతులకు ఆధునిక సాంకేతికతను అందించి, వారు అధిక దిగుబడులు సాధించే దిశగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ గోవిందరాజు తెలిపారు. పందిరి మామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రం, హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు కేవీకే సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేవీకే ద్వారా గిరిజన రైతులకు అందించే మేకలు, కోళ్ల యూనిట్‌లను విస్తరణ సంచాలకులు పరిశీలించారు.40 మంది రైతులకు ఉచితంగా అజోలా బెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి వెంగయ్య, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ క్రాంతికుమార్, ప్రవీణ్, కె.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

‘అక్షయపాత్ర’ను రద్దు చేయాలి



జి.మాడుగులలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో అక్షయపాత్ర విధానాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. అక్షయపాత్ర విధానాన్ని వ్యతిరేకిస్తూ, జీవో నంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ 11మండలాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించక పోవడం దుర్మార్గమన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యాసంవత్సరంలో నాలుగు నెలల్లో 16మంది విద్యార్థులు మృతి చెందారని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి న్యాయం చేయలేదని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల ఎస్ఎఫ్ఐ కమిటీ నాయకులు రవి,జోసెఫ్, శ్రీను, అభిషేక్, అనిల్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సచివాలయ ఉద్యోగుల కమిటీ

ముంచంగిపుట్టు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సచివాలయ సంఘం అధ్యక్షుడిగా కొమ్ము సాయికుమార్,ప్రధాన కార్యదర్శిగా పాంగి మనోజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు గౌరవ అధ్యక్షుడిగా వుబ్బేటి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, డాలిమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గణపతి, వరణ్‌బాబు, భార్గవి, సుజాత, కోశాధికారిగా గంగాధర్, టెక్నికల్ సెక్రటరీగా గలిత్, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా రుక్మిణి, వీరయ్య, సంధ్య, రాజుబాబు, తరుణ్,బుద్దులను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షకార్యదర్శులు సాయికుమార్,మనోజ్‌లు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సంక్షేమం,సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 18గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న పీవో సింహాచలం

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై ఉపాధ్యాయుల నియామకానికి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.సబ్ కలెక్టర్ కల్పశ్రీ, కమిటీ సభ్యులు డీడీ విజయశాంతి, ఎస్‌డీసీ జాన్‌రాజ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏకలవ్య ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్‌లతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు పీవో చెప్పారు. తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో ఎంపికకు సంబంధించిన వివరాలు నోటీస్ బోర్డులో ఉంచుతామన్నారు.

ఉల్లాస్ పథకంపై అవగాహన పెంచుకోవాలి

రాజవొమ్మంగి: ఉల్లాస్ పథకంపై ప్రతి వెలుగు మహిళ అవగాహన పెంచుకోవాలని రాజవొమ్మంగి వెలుగు కార్యాలయం ఏపీఎం రామాంజనేయులు తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల మహిళాసమాఖ్య అధ్యక్షురాలు బాలమ్మ అధ్యక్షతన వీవోఏల (బుక్ కీపర్లు)కు మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ప్రోగ్రాం లక్ష్యమన్నారు. ప్రతి పొదుపు సంఘం ఏ గ్రేడ్‌లోకి రావాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రుణాల రికవరీ, గృహణనిర్మాణాల తీరు,జల్ ఉత్సవ్ వంటి పలు ప్రభుత్వ కార్యక్రమాలపై వీవోఏలకు అవగాహన కల్పించారు. క్లస్టర్ కోఆర్డినేటర్లు రామకృష్ణ, లింగమ్మ, లక్ష్మీనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని వెలుగు సీసీలు, వీవోఏలకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కె.బాపన్న దొర ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ మండలంలోని చదువుకోనివారిని గుర్తించి,ప్రతిరోజు రాత్రి వారికి రెండు గంటలపాటు బోధించాలని సూచించారు. డిజిటల్ విద్య, బ్యాంకు లావాదేవీల పైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉషారాణి, ఏపీఎం భాస్కర్, ఈవోపీఆర్‌డీ డి.శివ కుమార్ పాల్గొన్నారు.

87 మందికి నేత్ర వైద్య పరీక్షలు



శస్త్ర చికిత్స అవసరమైన వారిని బస్సులో తరలిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన క్వీన్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి సహకారంతో 87 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్న 15 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్టు చెప్పారు. వీరిని బస్సులో విశాఖపట్నం తరలించామని,శస్త్రచికిత్సల సమయంలో మూడు రోజుల పాటు ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్యులు గీతాంజలి,శ్యాంప్రసాద్,రమేష్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.